ఆస్పత్రి భవనానికి మోక్షమెప్పుడో!

- కొత్త భవనాన్ని ప్రారంభించని అధికారులు
- శిథిలావస్థకు చేరిన పాత ఆస్పత్రి భవనం
- ఇబ్బందుల్లో సిబ్బంది, రోగులు



నూతనం గా నిర్మించిన ఆసుపత్రి భవనం



కూలడానికి సిద్ధంగా పాత ఆస్పత్రి గది

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనం ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభించడానికి సిద్ధం చేయాలని అప్పటి అధికారులు ఆదేశాలు జారి చేసినా.. ఇప్పటి వరకూ దాని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే నాణ్యతా లోపం వలన ప్రారంభానికి నోచుకోకముందే గోడలు పగుళ్లతో దర్శనమిస్తున్నాయి. అయితే గత 40 ఏళ్ల క్రితం నిర్మించిన పాత ఆస్పత్రి ఇప్పటికే చాలా వరకూ శిథిలావస్థకు చేరుకుంది. బాలింతలు ఉండే గదిలో చీలికలు అధికం కావడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పైకప్పు పరిస్థితి చూసి రోగులు ప్రాణ భయంతో ఆస్పత్రికి రావడానికి వెనకడుగు వేస్తున్నారు. వర్షం వచ్చిందంటే బాలింతల గది గోడలు ఉబ్బిపోయి ఎప్పుడు కూలుతుందోన్న భయంతో ఆందోళన చెందుతున్నారు. రోగుల కోసం ఏర్పాటు చేసిన మంచాలు ఉన్న గదిలో పైకప్పు మొత్తం కారుతుంది. ఆస్పత్రికి వచ్చినప్పుడు పైకప్పు వైపు చూసుకుంటూనే చికిత్స తీసుకోవాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. స్థానికంగా నివాసం ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించడం కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోవడంతో మౌలిక వసతులు లేక వైద్యులు, సిబ్బంది దూర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నారు. కాగా స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నోటికి వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యులు, సిబ్బందికి మౌలిక వసతులను కల్పించడంతోపాటు నూతన ఆస్పత్రి భవనం ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో..



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఆసుపత్రికి వచ్చి చికిత్స కోసం బెడ్డుపై పడుకోవాలంటేనే భయం వేస్తుంది. పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. కొత్త భవనం గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోగుల గురించి కూడా సిబ్బంది పట్టించుకోరు.

– కోదండ, చిన్నవడుగూరు

నూతన భవనం ప్రారంభించాలి



నూతనంగా నిర్మించిన భవనాన్ని అధికారులు త్వరగా ప్రారంభించాలి. పాత ఆస్పత్రిలో రోగులకు మౌలిక వసతులు లేవు. రోగుల ఇబ్బందులను గురించి ఎవ్వరూ పట్టించుకోరు. నాణ్యమైన వైద్యం అందిస్తే చాలా బాగుంటుంది. ఇక్కడ రాత్రి సమయాల్లో వైద్యులు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

– నగేష్, పెద్దవడుగూరు

మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం



ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం చేస్తున్నాం. ఆస్పత్రి భవనం పాతది కావడంతో ఇబ్బందులు పడుతున్నాము. త్వరగా కొత్త ఆసుపత్రి భవనం ఇస్తే బాగుంటుంది. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా కొత్తగా నిర్మించిన భవనంలోకి వెళ్తాం.

– శ్రీనివాసబాబు, వైద్యుడు, పెద్దవడుగూరు

కాలేజీ వద్ద బస్సులు ఆపాలి



ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో వాగ్వాదం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

యాడికి: పాఠశాలలు, కాలేజీల వద్ద బస్సులు ఆపకపోతే ఎలాగంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. వివరాల మేరకు.. మండలంలోని రాయలచెరువు, పెద్దపేట చిక్కేపల్లి, నిట్టూరు గ్రామాల నుంచి విద్యార్థులు రోజూ మండల కేంద్రంలోని గుత్తిరోడ్డులో ఉన్న ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలకు వచ్చి విద్యనభ్యసిస్తుంటారు. పాఠశాలలకు, కాలేజీలకు వచ్చేటప్పుడు, ఇంటికి వెళ్లే సమయంలో ఆర్టీసీ బస్సులు ఆపడం లేదు. దీంతో విద్యార్థులు గత కొంత కాలంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. గురువారం మధ్యాహ్నం రెండు బస్సులు విద్యాలయాల వద్ద నిలబెట్టకపోవడంతో సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు మండల కేంద్రంలోని కోన రోడ్డులో ప్రయాణికుల కోసం ఆపి ఉన్న బస్సులను అరగంట పాటు ముందుకు కదలనివ్వక డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పాసులు ఉన్నా బస్సులను ఆపడం లేదని దీంతో విద్యార్థులు పరీక్షల సమయమే కాకుండా ఎండలు ఎక్కువగా ఉండటంతో చాలా ఇబ్బందులు గురవుతున్నారని డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రోజూ పాఠశాలలు, బస్టాండుల వద్ద బస్సులను నిలపాలని అలా చేయకుంటే డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని తెలిపి బస్సులను గుత్తి, తాడిపత్రికి పంపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమస్య తెలుసుకుంటున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి

పెద్దపప్పూరు: ప్రజా సమస్యలు పరిష్కరించడానికే 'మీ మాటే ముఖ్యం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి అన్నారు. గురువారం పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీ మాటే ముఖ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరు మండలానికి చెందిన మహబూబ్‌బీ తమ వద్ద కారు కుదువకు పెట్టి డబ్బులు చెల్లించకుండా కారు తీసుకెళ్లారని, అమలదిన్నె గ్రామానికి చెందిన నారాయణస్వామి తాను భూమి కొనుగోలు చేసి కొంత డబ్బులు ఇచ్చానని తనకు తెలియకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే అమలదిన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులు భూమి కొలతలకు తన సహోదరులు సహకరించలేదని, గార్లదిన్నె గ్రామానికి చెందిన మాధవ తాను ఆది అనే వ్యక్తికి డబ్బులు ఇచ్చానని, అతను చనిపోయాడని భార్యను డబ్బులు అడిగితే ఇవ్వడంలేదని ఇలా పలువురు ఏఎస్పీకి వివరించారు. మీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని బాధితులకు ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించండి

తాడిపత్రి: ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులను కల్పించి వలసలను ఆపడంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పరిరక్షించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తలారి రంగయ్య కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 22, 23 తేదీల్లో బండ్లపల్లి నుంచి అనంతపురం వరకూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కష్టజీవుల పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. అందులో భాగంగా గురువారం ఆయన నియోజకవర్గ కమిటీ సభ్యులతో కలసి మండలంలోని తేరన్నపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేసి, మెటీరియల్ కాంపోనెంట్‌ను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలన్నారు. కుటుంబ జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి వయోజనునికి జాబ్ కేటాయించాలని, 200 రోజుల పని దినాలు కేటాయించాలన్న తదితర డిమాండ్లపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు, అధ్యక్షులు నారాయణరెడ్డి, మండల కార్యదర్శి గోపాల్, సీపీఐ తాడిపత్రి మండల కార్యదర్శి నాగరంగయ్య, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

గుత్తి: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందువులపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. అక్కడి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాడులను అణచివేయడంలో విఫలమైయ్యారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే రాష్ట్ర ప్రతి పాలన విధించాలని హిందూ అనుసంధాన సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. గుత్తిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం హిందూ అనుసంధాన సంస్థల ప్రతినిధులు తెగదొడ్డి తిమ్మారెడ్డి, మారాకుల రమణ, ఆకుల మురళీ, బీసీ వెంకప్ప, గోరంట్ల నాగయ్య తదితరులు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలంటూ ఈ నెల 22న గుత్తిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హిందూ అనుసంధాన సంస్థల సభ్యులు మురళి, రొయ్యల నారాయణ,మూలింటి బాలకృష్ణ, రవి తేజ, కృష్ణయ్య, విజయ్, లక్ష్మయ్య, వీరోజీ, సుధాకర్ నాయుడు, నూర్ బాషా, హసన్ అలీ బాషా, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర '

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది కలిసి ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపడతామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తాడిపత్రి రూరల్: స్వచ్ఛ తాడిపత్రిలో భాగంగా ఈ-చెక్‌పై ఈనెల 19న ర్యాలీ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ గురువారం తెలిపారు. పట్టణంలోని టౌన్ పోలీసు స్టేషన్ సర్కిల్ నుంచి దిన కురగాయల మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీలో మునిసిపల్ పాలక వర్గం, అధికారులు పాల్గొని స్వచ్ఛ తాడిపత్రిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకిచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

తాడిపత్రిటౌన్: ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలతో పాటు యువగళం పాదయాత్రలో విద్యాశాఖమంత్రి లోకేష్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో గురువారం కడపలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28 వరకూ కడపలో జరిగే శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.3580 కోట్లు విడుదల చేయలేదన్నారు. వసతిగృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా కోశాధికారి ఆంజనేయులు, తాడిపత్రి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్, హర్ష, హరీష్, లావణ్య, మౌనిక పాల్గొన్నారు.

ఆరు గొర్రెల చోరీ

గుంతకల్లు రూరల్: మండలంలోని దోసలుడుకి గ్రామంలో బుధవారం రాత్రి పొలాల్లోని గొర్రెల మందలో ఆరు జీవాలు చోరీకి గురయ్యాయి. దోసలుడుకి గ్రామానికి చెందిన నాగప్ప అనే రైతు తన గొర్రెలను తోటి కాపరుల గొర్రెలతో కలసి గ్రామ శివారుల్లో బుధవారం రాత్రి నిలుపుకున్నారు. గురువారం ఉదయానికి ఆరు గొర్రెలు చోరీకి గురవడంతో నాగప్ప కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశామని ఎస్ఐ టీపీ వెంకటస్వామి తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

బుక్కరాయసముద్రం: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ అన్నారు. గురువారం మండలంలోని కొర్రపాడు సెక్టారులోని రేకులకుంట గ్రామంలో పౌష్టిక ఆహార పక్షోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం



చిన్నవడుగూరులో క్షయ వ్యాధి రోగులకు చికిత్స అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసబాబు

పెద్దవడుగూరు: క్షయ వ్యాధిని నివారించడమే లక్ష్యమని పెద్దవడుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రీనివాసబాబు, గుత్తి క్షయ వ్యాధి యూనిట్ అధికారి దేవదాస్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నవడుగూరు గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధి సోకిన వ్యక్తితో పాటు అతడికి సమీపంగా నివసించే వ్యక్తులు కూడా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి చికిత్స అందజేస్తామన్నారు. అందుకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందన్నారు. దీర్ఘకాలికంగా దగ్గు ఉన్న వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సీహెచ్ఓ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన విగ్రహాల పున: ప్రతిష్ట



క్యూలో స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, గుత్తి కోట సంరక్షణ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహాల పున: ప్రతిష్టోత్సవం గురువారం ఘనంగా ముగిసింది. మూడు రోజులుగా హోమాలు, విగ్రహాల ప్రాణ ప్రతిష్ట వంటి కార్యక్రమాలతో పాటు వినాయకుడు, ఆంజనేయస్వామి, నవ గ్రహాల ప్రతిష్ట జరిగింది. ఈ క్రమంలో చివరి రోజు హోమాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి స్వాములను దర్శించుకున్నారు.

'అగ్నివీర్'లకు అభినందన



అగ్నివీర్‌లుగా ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ (స్వయంప్రతిపత్తి) కళాశాలలో చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు మధు, మహేంద్ర, వీరేష్ ఇండియన్ ఆర్మీలో భాగమైన అగ్నివీర్‌లుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అగ్నివీర్‌లుగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు. తమ కళాశాల నుంచి ఇప్పటివరకు 12 మంది విద్యార్థులు అగ్నివీర్‌లుగా ఎంపికై న విధులు నిర్వర్తిస్తున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. దేశానికి సేవ చేసుకునే ఉద్యోగాలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ అధికారి బాలకృష్ణ, కామర్స్ హెచ్‌ఓడీ డాక్టర్ జనార్దన్ శాస్త్రీ, పీడీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి



రేకులకుంటలో కరపత్రాలను విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: రైతులు నీటి సంరక్షణలో భాగంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ కేవీ రావు సూచించారు. గురువారం మండలంలోని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకర్‌బాబు అధ్యక్షతన వర్షపు నీటి యాజమాన్యం, పంట దిగుబడి పెంచడానికి అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు నీటిని వృథా చేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించు కోవాలన్నారు. పొలాల్లో నీటి కుంటలు, చెక్ డ్యాంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నారాయణస్వామి, లక్ష్మణ్, డాక్టర్ నటరాజ్, డాక్టర్ లక్ష్మి కళ్యాణి, నజీర్ ఉద్దీన్ పాల్గొన్నారు.

గుంతకల్లు కీర్తిప్రతిష్టలు పెంచాలి



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు: విదార్థులు గుంతకల్లు కీర్తి ప్రతిష్టలు మరింత పెంచేలా కష్టపడి చదవి ఉన్నత స్థానాలకు ఎదగాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆకాంక్షించారు. ఇటీవల విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో గుంతకల్లుకు చెందిన షబానాజ్ పట్టణంలోని శస్త్ర కళాశాలలో చదువుతూ బైపీసీలో 993 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. దీంతో గురువారం హనుమేష్‌నగర్‌లోని షబానాజ్ ఇంటికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వెళ్లి విద్యార్థిని అభినందిచారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను బహుకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, గుజారి మహమ్మద్‌ఖాజా, తలారి మస్తానప్ప, సద్దామ్, ఫ్రూట్ మాస్తాన్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 19వ వార్డు సత్యనారాయణపేటలోని సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం మధ్యాహ్నం మేనేజర్ రాధ, సీనియర్ అసిస్టెంట్ రాముతో కలిసి ఆయన సచివాలయానికెళ్లి సిబ్బంది హాజరు పట్టికతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. వార్డులో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన ఆరా తీశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ట్రిబుల్ ఎస్ పాఠశాలలో గురువారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అధికారులు విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు గ్యాస్ సిలిండర్ లీకై తే ఏవిధంగా ఆర్పివేయాలో వివరించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు 101కు లేదా 08558-222299 ఫోన్ చేయాలన్నారు. ఫైర్ ఆఫీసర్ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

పామిడి: పామిడితో పాటు మండలంలోని పీ కొండాపురంలో రోడ్డు ప్రమాద బాధితులు కమ్మిరెడ్డి కుటుంబం, బాధితుడు నరసింహను గురువారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్ రెడి, నాయకులు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, అనుంపల్లి సూరి, శివ, గౌస్, ధనుంజయరెడ్డి, బోయ సుంకన్న, పుల్లయ్య, శీనా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌పీసీ పట్టణాధ్యక్షుడిగా షెక్షావలి



గుత్తి: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్(ఐహెచ్‌ఆర్ పీసీ) గుత్తి పట్టణ అధ్యక్షుడిగా షెక్షావలిని ఎంపిక చేశారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు మాజీ మహమ్మద్ ముజాహిద్ , నేషనల్ చైర్మన్ షోయబ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా షెక్షావలి మాట్లాడుతూ ప్రజా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రౌడీ షీటర్ల బైండోవర్

తాడిపత్రి: పట్టణంలో ఐదుగురు రౌడీ షీటర్లను పోలీసులు గురువారం తహసీల్దార్ రజాక్‌వలి ఎదుట బైండోవర్ చేశారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందులో భాగంగానే ఐదుగురు రౌడీ షీటర్లును తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించామన్నారు. రౌడీ షీటర్లకు తహసీల్దార్ రూ.లక్ష పూచీకత్తు విధించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

తాడిపత్రి రూరల్: నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన ప్రమోషన్లను పునరుద్దరించాలంటూ ప్లకార్డులతో గురువారం ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యునియన్ నాయకులు, కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. రీజనల్ సెక్రటరీ ప్రతాప్ నారాయణ మాట్లాడుతూ 1- 2019 సర్కులర్‌ను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఉద్యోగులకు పాత వైద్య విధానాన్ని అమలు చేయాలన్నారు. గ్యారేజీలో నాణ్యత కలిగిన పనిముట్లను అందజేయాలన్నారు. అన్‌కాల్ డ్రైవర్లకు నెలవారీ జీతాలు ఇవ్వాలన్నారు. అక్రమ సస్పెన్షన్లను నిలువరించాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో డిపో చైర్మన్ మహేష్, రీజనల్ నాయకులు సుధాకర్, గ్యారేజీ సెక్రటరీ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీఎస్ఎన్ఎల్ మేళా

గుంతకల్లు: బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి పట్టణంలోని మోదీనాబాద్‌లో టెలిఫోన్ కార్యాలయంలో ఈనెల 19 శనివారం మేళా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఈ సతీష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకూ కార్యక్రమం ఉంటుందన్నారు. బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు కొత్త సిమ్, ఫైబర్ ఇంటర్‌నెట్, టెలిఫోన్ బిల్లులు, సిగ్నల్ సమస్య, మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తదితర సేవలు సహా ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

బీకేఎస్‌లో వైద్య సిబ్బంది నిరసన

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కేంద్రం ఎదుట మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందజేయాలన్నారు. 23 శాతం ఫిట్మెంట్ ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నుంచి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈపీఎస్ పునరుద్ధరించాలన్నారు. వివిధ రకాల యాప్స్‌ను తొలగించి ఒకే యాప్‌ను అన్నీ పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో జ్యోతి, మంజు భార్గవి, శ్రీజ, శ్రీకీర్తి, మణి, యామిని, జయంతి, గౌతమి పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రిటౌన్: స్థానిక ప్రభుత్వ పెన్సనర్స్ సంఘం భవనంలో సంఘం సభ్యులు గురువారం 20 మంది దివ్యాంగులకు నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, నరసింహులు, సత్యనారాయణ, అశ్వత్థరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'స్కౌట్'తో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి

గార్లదిన్నె: విద్యార్థులు స్కౌట్ ఉద్యమంలో చేరితే క్రమశిక్షణ, నాయకత్వం లక్షణాలు పెంపొందుతాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ గార్లదిన్నె మోడల్ స్కూల్ విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో జనవరి 3 నుంచి ఏప్రిల్ 2 వరకు 24 మంది స్కౌట్స్, 20 మంది గైడ్స్ విద్యార్థులు చేరి ప్రవేశ సిలబస్ పూర్తి చేశారన్నారు. అందు లో భాగంగా మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రవేశ సిలబస్‌పై పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్ నాగరాజు, గైడ్ కెప్టెన్ వాణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

శింగనమల: ఓటరుగా నిరంతరం నమోదు చేసుకోవచ్చని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మల్లికార్జునుడు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులపై ఫిర్యాదులు ఇచ్చుకోవచ్చన్నారు. ఓటరు నమోదులో ఏ సమస్యలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బ్రహ్మయ్య, ఈరమ్మ, పుణ్యవతి, శేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌వీ నారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇంటి అర్జీల సంగతి ఏమైంది?

తాడిపత్రి: గతంలో ఇంటి పట్టాల కోసం సీపీఐ అధ్వర్యంలో నిరసన చేపట్టి మూడు వేల మందితో అర్జీలు ఇప్పించామని, ఆ అర్జీల సంగతి ఏమైందంటూ గురువారం సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు అర్జీ అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలోనే వార్డుల వారిగా అర్హులను గుర్తించి ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ సీపీఐ కార్యదర్శి చిరంజీవియాదవ్, మహిళా కార్యదర్శి సావిత్రమ్మ, అబ్రహాం, నాగార్జున, ఫాతిమా పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

యాడికి: నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిన భర్త తిరిగి రాలేదని ఓ వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పచ్చారుమేకలపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ అనే వృద్ధురాలు గురువారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన భర్త షేక్ మహబూబ్ బాషా నాలుగు నెలల కిందట బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. పలు చోట్ల వెతికినా కనిపించలేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

శింగనమల: ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి నరసింహరాజు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం న్విహించారు. ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల వివరాలను అయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు వివరాలు తయారు చేసి అందజేయాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల వివరాలను పరిశీలించి, వారిని బడుల్లో చేర్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

'కార్పెంటర్లకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తాం'

గుంతకల్లు: పట్టణంలోని కార్పెంటర్లకు ఇంటి స్థలాలు మంజూరు చేయడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం స్థానిక ఈద్గా ఫంక్షన్ హాల్‌లో పట్టణ కార్పెంటర్ల ఐక్యమత్య సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ ద్వారా రోజుకు రూ.500 ఇస్తూ ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్లను అందజేస్తారు. కావున ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ కేసీ హరి, నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, గుమ్మనూరు వెంకటేష్, గుజరీ ఖాజా, కార్పెంటర్లు ఐకమత్య సమితి నాయకులు శిల్పిబాషా, షెక్షావలి, పప్పూరుబాషా, టెంకాయల యూనస్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుత్తి: పట్టణంలోని మోర్ దుకాణం ఎదురుగా ప్రశాంత్ అనే యువకుడికి చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. ప్రశాంత్ తన బైక్‌ను మోర్ దుకాణం ఎదురుగా పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.